


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

అక్షర

# రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 08.09.2025 | సంపుటి : 2 | సంచిక :216 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | Monday | 08.09.2025 | volume : 2 | Issue : 216 | Pages : 8 | Cost : 2/- |




## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..


సెల్ : 9182 474 575

# చంద్రగ్రహణం

## పలు ఆలయాల మూసివేత

05



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో..



## దేశంపై ప్రేమతో ఓటేయండి

### ఎంపీలకు జస్టిస్ సుదర్శన్ రెడ్డి విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 7 :** ఉపరాష్ట్రపతి ఎన్నిక సమీపించిన వేళ.. విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి ఎంపీలకు కీలక విజ్ఞప్తి చేశారు. పార్టీ విధేయత ఆధారంగా ఓటు వేయొద్దని, దేశంపై ప్రేమతో ఓటేయాలని సూచించారు. సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంలో ఎంపీలను ఉద్దేశిస్తూ జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఓ వీడియో సందేశం విడుదల చేశారు. "ఈ ఎన్నికల్లో పార్టీ విప్ ఉండదు. సీక్రెట్ బ్యాలెట్ ద్వారానే ఎన్నిక జరుగుతుంది. ఏ రాజకీయ పార్టీకి విధేయత కాదు.. దేశం పట్ల ప్రేమ మీ ఎంపికకు మార్గనిర్దేశం చేయాలి. మన దేశ ఆత్మను కాపాడుకునే నైతిక బాధ్యత అందరిపై ఉంది. నాపై విశ్వాసం ఉంచడం ద్వారా పార్లమెంటరీ సంప్రదాయాలను రక్షించినవారవుతారు. ప్రజాస్వామ్యానికి నిజమైన దేవాలయంగా రాజ్యసభ నిలుస్తుందని చాటిచెప్పవచ్చు" అని జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఇది కేవలం ఉప రాష్ట్రపతిని ఎన్నుకునే ఓటు కాదని, భారత స్ఫూర్తిని చాటిచెప్పేదని జస్టిస్ సుదర్శన్ రెడ్డి చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలపై భారత ప్రజాస్వామ్యం నిర్మితమైందని, అదే దృక్పథంలో దశాబ్దాలుగా బలోపేతం అవుతోందన్నారు. అయితే, నేడు ఆ ప్రజాస్వామ్య భావన తగ్గుతోందని, పౌరుల హక్కులు ఒత్తిడికి లోనవుతున్నాయన్నారు. ఇటువంటి తరుణంలో ప్రజాస్వామ్య గణతంత్ర ఆత్మను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని చెప్పారు.

# అనర్హతపై ఎలా ముందుకెళ్దాం?

- స్పీకర్ నోటీసులందుకున్న ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ భేటీ
- కృష్ణమోహన్‌రెడ్డి సహా 9 మంది హాజరు
- జ్వరం కారణంగా రాలేకపోయిన కడియం శ్రీహరి
- అనర్హత పిటిషన్ విచారణపై న్యాయనిపుణులతో సమీక్ష
- నియోజకవర్గాల సమస్యలపై ముఖ్యమంత్రి ఆరా
- పరిష్కారానికి నిధులిస్తామని ఎమ్మెల్యేలకు రేవంత్‌రెడ్డి హామీ

బీఆర్ఎస్ పార్టీ అనర్హత పిటిషన్‌కు సంబంధించి స్పీకర్ ప్రసాద్‌కుమార్ నుంచి నోటీసులందుకున్న ఎమ్మెల్యేలు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. సీఎం నివాసంలో జరిగిన ఈ భేటీకి.. కడియం శ్రీహరి మినహా 9మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. జ్వరం కారణంగా ఆయన ఈ సమావేశానికి హాజరు కాలేకపోయారు. అయితే తాను పార్టీ మారలేదంటూ పలుమార్లు ప్రకటించిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఈ భేటీకి హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పలువురు న్యాయనిపుణులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

హైదరాబాద్, సెప్టెంబరు 7 : పది మంది ఎమ్మెల్యేల అనర్హత కేసుకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, స్పీకర్ నోటీసుల జారీ, ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణ తదితర అంశాలపై న్యాయ నిపుణులతో సమీక్షించారు. అయితే ఇప్పటివరకు వివరణ ఇచ్చిన ఎమ్మెల్యేలు.. తాము పార్టీ మారలేదని, నియోజకవర్గ అభివృద్ధికి నిధులడిగేందుకు ముఖ్యమంత్రిని ఇతర ఎమ్మెల్యేలు కలిసినట్లుగానే తామూ కలిశామని చెప్పినట్లు సమాచారం. నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డిని ఇప్పటిదాకా వంద మందికి పైగా ఎమ్మెల్యేలు కలిశారని వివరించినట్లు తెలుస్తోంది. కాగా, అనర్హత కేసు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు,

మిగతా 2 లో





## 3 రోజుల్లో 30 వేల టన్నుల యూరియా

- యూరియా సరఫరా పెరుగుతుంది
- కేంద్రానికి సీఎం విజ్ఞప్తితో కదలిక: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**అశ్వారావుపేట :** రానున్న మూడు రోజుల్లో రాష్ట్రానికి మరో 30 వేల టన్నుల యూరియా రానుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. గడచిన ఆరు రోజుల్లో రాష్ట్రంలో 33 వేల టన్నుల యూరియా సరఫరా చేసినట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట సమీపం గంగారంలోని వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం సాయంత్రం విలేకర్లతో ఆయన మాట్లాడారు. 30 శాతం యూరియా దేశంలోనే తయారవుతున్నా ఏ రాష్ట్రానికి ఎంత సరఫరా చేయాలో కేంద్రం వద్ద సరైన ప్రణాళిక లేకపోవడంతో ఈ ఇబ్బందులు ఎదురవుతున్నాయని విమర్శించారు. డీలర్లు తప్పు చేయకుండా నేరుగా రాష్ట్రంలో 495 రైతు వేదికల వద్దే యూరియాను విక్రయించే ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం 13,210 టన్నుల యూరియా వచ్చిందని, 8న 6,612 టన్నులు, 9న 10,635 టన్నుల యూరియా అందుబాటులోకి రానుందని, రైతులు ఎవరూ భయపడాల్సిన పనిలేదని స్పష్టం చేశారు.

## ఆ 3 కేసులను సీబీఐకి ఎందుకివ్వరు

- గొర్రెల స్కాం బాధ్యులపై చర్యలేవీ?
- రాష్ట్ర ప్రభుత్వానికి బండి సంజయ్ ప్రశ్న

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్తు కొనుగోళ్ల ఒప్పందంలో, ఫార్ములా ఈ రేస్‌లో అవకతవకలు, ఫోన్ ట్యాపిం గ్ కేసుల్లో సీబీఐ విచారణను ఎందుకు కోరడం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. 'విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంలో అవకతవకలపై జస్టిస్ మదన్ బీ లోకూర్ కమిషన్ నివేదిక ఇచ్చింది కదా? దాన్ని ఎందుకు దాచిపెట్టారు? ఇప్పటిదాకా ఎందుకు చర్యలు తీసుకోలేదు?' అని ఆయన ప్రశ్నించారు.



02

## 'ట్రిపుల్ ఆర్' అలైన్‌మెంట్ మారాలంటే ప్రభుత్వమే మారాలేమో

### ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

"రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్)లో భూములు కోల్పోతున్న చౌటుప్పల్ డివిజన్ (ఉత్తర భాగం) రైతులు తొక్కని గడపలేదు. ఢిల్లీలో పెద్దలను కలిసినా వారికి న్యాయం జరగలేదు. ఓ కంపెనీ కోసం గత ప్రభుత్వం హయాంలో అలైన్ మెంట్ మార్చారు. ఇప్పుడు దక్షిణ భాగం అలైన్‌మెంట్ మారాలంటే ఉత్తర భాగం మారాలి. ఉత్తర భాగం మారాలంటే ప్రభుత్వమే మారాలేమో" అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాట్ కామెంట్ చేశారు.



02



# వరంగల్‌లో భారీవర్షం..

## వరదలో చిక్కుకున్న రెండు ఆర్టీసీ బస్సులు

**వరంగల్ :** వరంగల్ నగరంలో భారీ వర్షం కురిసింది. దీంతో ఉదయం వరంగల్ రైల్వే అండర్ బ్రిడ్జి కిందికి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఆ మార్గంలో వెళ్లిన రెండు ఆర్టీసీ బస్సులు వరద నీటిలో చిక్కుకున్నాయి. అందులో ఉన్న ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు వేశారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో మిల్స్ కాలనీ పోలీసులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తాడు సాయంతో బస్సుల్లో ఉన్న ప్రయాణికులను సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. అన్నారం, మహబూబాద్ నుంచి వచ్చిన ఈ బస్సుల్లో సుమారు వంద మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ఘటన అనంతరం ఆ మార్గాన్ని పోలీసులు మూసివేశారు. మరో మార్గంలో వాహనాలను మళ్లించారు.



# చర్లపల్లి డ్రగ్స్ కేసు..

## కార్మికుడిగా సంస్థలో చేరిన ముంబయి పోలీసు

**హైదరాబాద్:** చర్లపల్లి డ్రగ్స్ కేసులో కీలక అంశాలు వెలుగు చూస్తున్నాయి. వాగ్దేవీ ల్యాబొరేటరీస్‌పై ఆకస్మిక దాడులు చేయగా.. డ్రగ్స్ తయారీ యూనిట్ బయటపడిన విషయం తెలిసిందే. ఈ సంస్థ యాజమాని గతంలోనూ పోలీసులకు పట్టుబడినట్లు దర్యాప్తులో తేలింది. తన పలుకుబడితో డ్రగ్స్ కేసులో అరెస్టు కాకుండా చూసుకున్నాడు. ముంబయిలో డ్రగ్స్ సరఫరా చేస్తోన్న బంగ్లాదేశీ మహిళను అరెస్టు చేసి.. కేసు దర్యాప్తు చేస్తుండగా ఈ ల్యాబొరేటరీలో డ్రగ్స్ తయారీ యూనిట్ విషయం బయటపడింది. ఈ నేపథ్యంలో ముంబయి నార్కోటిక్ పోలీసులు వాగ్దేవీ ల్యాబొరేటరీస్‌పై నిఘా పెట్టారు. ముంబయి పోలీసుల్లో ఒకరు కార్మికుడిగా ల్యాబొరేటరీస్‌లో చేరారు. నెల రోజులపాటు ప్లాన్ చేసి వివరాలను పక్కాగా సేకరించారు. అనంతరం శనివారం పోలీసులు దాడి చేసి రూ.కోట్లు విలువ చేసే డ్రగ్స్, ఎండీ డ్రగ్స్ తయారీకి వినియోగించే 35,500 లీటర్ల ముడి సరుకును స్వాధీనం చేసుకున్నారు. 5.79కిలోల మెఫిడ్రోన్, 950 కిలోల పొడి పదార్థం, మిథైలెనెడియాక్సీ మెథాంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# ఆ 3 కేసులను సీబీఐకి ఎందుకివ్వరు

- గొర్రెల స్కాం బాధ్యులపై చర్యలేవీ?
- రాష్ట్ర ప్రభుత్వానికి బండి సంజయ్ ప్రశ్న

**హైదరాబాద్, సెప్టెంబరు 7 :** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్తు కొనుగోళ్ల ఒప్పందంలో, ఫార్ములా ఈ రేస్‌లో అవకతవకలు, ఫోన్ ట్యాపిం గ్ కేసుల్లో సీబీఐ విచారణను ఎందుకు కోరడం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. 'విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంలో అవకతవకలపై జస్టిస్ మదన్ బీ లోకూర్ కమిషన్ నివేదిక ఇచ్చింది కదా? దాన్ని ఎందుకు దాచిపెట్టారు? ఇప్పటిదాకా ఎందుకు చర్యలు తీసుకోలేదు?' అని ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఆధారాలను సీబీఐకి ఇవ్వాలన్నారు. ఈ మేరకు ఆయన కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. 'గొర్రెల స్కాంలో వందల కోట్ల అవినీతి బయటపడ్డా బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ప్రజాధనాన్ని దోచుకున్న దొంగలను ఎందుకు జైలుకు పంపడం లేదు? వాళ్ల ఆస్తులను ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదు? ఫార్ములా ఈ రేస్ స్కాం పేరుతో ప్రతిసారి 'ట్విటర్ టిల్లు'ను విచారణకు పిలిచి డ్రామాలాడుతున్నారే తప్ప చర్యలేవీ? అవినీతి జరిగిందని మీరే అనేకసార్లు చెప్పారు కదా? ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ఈ స్కాంలో విదేశీ సంస్థ పాత్ర ఉంది కదా? మరి ఈ కేసును సీబీఐ విచారణ ఎందుకు ఇవ్వడం లేదు?' అని సంజయ్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసును రెండేళ్ల నుంచి డైలీ సీరియల్‌లా సాగదీస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలాడుతోందని ఆయన విమర్శించారు.

# గురుకులాల ఖ్యాతి దిగజారింది

## మాజీ మంత్రి హరీశ్‌రావు



**హైదరాబాద్:** ఉపాధ్యాయ దినోత్సవం నాడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆడంబరంగా ప్రకటనలు చేయడం కాదని, ముందు ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి 22 నెలల పాలనలో గురుకులాల ఖ్యాతి దిగజారిందని హరీశ్ ఆరోపించారు. "కాంగ్రెస్ పాలనలో గురుకుల విద్యావ్యవస్థ దీనస్థితికి చేరింది. విష జ్వరాలు, పాము, ఎలుక, కుక్క కాట్లు, కలుషితాహారంతో విద్యార్థులు ఆసుపత్రుల పాలై ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. అందులో పనిచేస్తున్న 2500 మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి రెండు నెలల నుంచి జీతాలివ్వని దుస్థితి. ముందు వారికి సకాలంలో జీతాలు చెల్లించాలి. కేసీఆర్ హయాంలో గురుకుల విద్యా వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిస్తే రేవంత్ రెడ్డి పాలనలో నరక కూపాలుగా మారాయి. గాడితప్పిన గురుకుల విద్యావ్యవస్థపై శ్రద్ధ వహించి, పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# బీసీలకు 42% రిజర్వేషన్లను అడ్డుకుంటున్నది బీజేపీ నాయకులే

- కామారెడ్డి సభతో కేంద్రం మెడలు వంచుతాం
- సన్నాహక సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్
- హాజరైన మంత్రులు పొంగులేటి, పొన్నం, సీతక్క, సురేఖ, శ్రీహరి



**కామారెడ్డి, సెప్టెంబరు 7 :** కామారెడ్డిలో ఈ నెల 15న నిర్వహించే బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభకు లక్షల మంది తరలివచ్చి కేంద్రం మెడలు వంచాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. "కేంద్రంపై కామారెడ్డిలో సమరశంఖం పూరించబోతున్నాం. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్య, ఉద్యోగాల్లో 42% రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులు చట్టాలు కాకుండా భాజపా నాయకులు అడ్డుకుంటున్నారు. వారి భరతం పట్టడానికే కామారెడ్డి సభ నిర్వహిస్తున్నాం.

### బండి సంజయ్ సెక్యూరిటీ లేకుండా బయట తిరుగుదామా?

బీసీ డిక్లరేషన్ విజయోత్సవ సభకు లక్షల మంది తరలివచ్చి కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిల బాగోతాన్ని బయటపెట్టడం ఖాయం. భాజపా నాయకులంటే దేవుడి పేరిట ఓట్లు దండుకునేవారు. ఫలానా పనిచేశానని, పరిశ్రమ తెచ్చానని చెప్పి ఓట్లు అడిగే దమ్ము బండి సంజయ్‌కి ఉందా? ఆయన, నేను సెక్యూరిటీ లేకుండా బయటతిరుగుదాం. ప్రజలు ఎవర్ని ఆదరిస్తారో చూద్దాం. దేవుడి పేరు మీద కాంగ్రెస్ పార్టీ ఏనాడూ ఓట్లడగలేదు. పనిచేసి ఓట్లడుగుతాం. సోనియా, రాహుల్ గాంధీలు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటాం. ఆరు గ్యారంటీలు ఇస్తామని తుక్కుగూడ సభలో హామీ ఇచ్చాం. అదే సభలో బీసీలను ఆదుకుంటామని చెప్పాం. బీసీ బిల్లులకు భాజపా వాళ్లు అసెంబ్లీలో మద్దతిస్తున్నారు. అవి చట్టాలైతే కాంగ్రెస్‌కు పేరొస్తుందనే ఉద్దేశంతో కేంద్రంలో అడ్డుకుంటున్నారు. బీసీలకు 42% రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్దామని మా మంత్రులకు చెప్పాను. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి తపిస్తున్నారు. బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్‌లు ఏనాడూ బీసీల గురించి మాట్లాడలేదు. భాజపా నాయకులకు చిత్తశుద్ధి ఉంటే మేం తీసుకొచ్చిన బిల్లులు ఒక్కరోజులోనే చట్టమవుతాయి. బిల్లులు చట్టాలుగా మారకుండా ఎన్ని రోజులు ఆపుతారు? మూడేళ్ల తర్వాత కేంద్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయే. రాహుల్ ప్రధాని అయిన తర్వాత బీసీ రిజర్వేషన్ల బిల్లులను ఆమోదింపజేసుకుంటాం.

### కవితతో కేసీఆర్ డ్రామా ఆడిస్తున్నారు

రాష్ట్రాన్ని భారత రాష్ట్ర సమితి నాయకులు పదేళ్లపాటు దోచుకున్నారు. కాళేశ్వరం, భూములు, ఐటీ పేరిట దండుకున్నారు. ఇదే విషయాన్ని మేం చెబితే కొంతమంది నమ్మలేదు. రాష్ట్రాన్ని దోచుకున్నామని సాక్షాత్తూ కేసీఆర్ కుమార్తె కవితే చెప్పారు. వాటాల్లో తేడాలు రావడం వల్లే వారి విషయాలు బయటపడ్డాయి. దోచుకున్న సొమ్మంతా తనకు, కేటీఆర్‌కు దక్కాలని... హరీశ్‌రావుకు, సంతోష్‌లకు ఎక్కువ వాటా పోతోందన్నది ఆమె బాధ. ఈ మాటను ఆమె ఐదేళ్ల క్రితమే చెప్పి ఉంటే సన్మానించేవాళ్లం. దీన్ని కూడా కేసీఆర్ ఆడిస్తున్న డ్రామాగానే భావిస్తున్నాం. కాళేశ్వరం అవినీతి వ్యవహారంపై నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కుటుంబ తగాదాల పేరిట కేసీఆర్ నటిస్తున్నారని నా అనుమానం" అని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# 'ట్రిపుల్ ఆర్' అలైన్‌మెంట్ మారాలంటే ప్రభుత్వమే మారాలేమో

## ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



**సంస్థాన్ నారాయణపురం:** "రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్)లో భూములు కోల్పోతున్న చౌటుప్పల్ డివిజన్ (ఉత్తర బాగం) రైతులు తొక్కని గడపలేదు. ఢిల్లీలో పెద్దలను కలిసినా వారికి న్యాయం జరగలేదు. ఓ కంపెనీ కోసం గత ప్రభుత్వం హయాంలో అలైన్ మెంట్ మార్చారు. ఇప్పుడు దక్షిణ భాగం అలైన్‌మెంట్ మారాలంటే ఉత్తర భాగం మారాలి. ఉత్తర భాగం మారాలంటే ప్రభుత్వమే మారాలేమో" అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాట్ కామెంట్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితులతో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆదివారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తనకు అన్యాయం జరిగినా ఊరుకున్నానని, ప్రజలకు జరిగితే ఎంత దూరమైనా వెళ్తానని చెప్పారు. అవసరమైతే ట్రిపుల్ ఆర్ రద్దయినా సరే భూనిర్వాసితులకు అన్యాయం జరగనివ్వనని భరోసానిచ్చారు. ఎక్కడికక్కడ ప్రభుత్వాన్ని స్తంబింపజేస్తేనే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ప్రజలే తన బలం.. బలగమని, వారి కోసం ఎలాంటి పోరాటానికైనా, అవసరమైతే ఎంత త్యాగం చేయడానికైనా సిద్ధమన్నారు. అందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే కోరారు. తాను అధికార పార్టీ ఎమ్మెల్యేను.. అయినా సరే ప్రజలకు అన్యాయం జరిగితే ప్రభుత్వంతో పోరాడేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. "నేను లాలూచీపడి ముఖ్యమంత్రి దగ్గరికి వెళ్లి పదవి ఇస్తే చప్పుడు చేయకుండా కూర్చోను. నాకు మా ప్రాంత ప్రజలే ముఖ్యమని సీఎంకు చెబుతా. రాజగోపాల్‌రెడ్డి గట్టి వాడు కొట్లాడటానికి వెనుకాడరనే మీ నమ్మకాన్ని వమ్ము చేయను. భూమికి రైతుకు మధ్య భావోద్వేగ అనుబంధం ఉంటుంది.. అది విడదీయలేనిది. భూమి అంటే వ్యవసాయం ఒక్కటే కాదు అది ఒక స్టేటస్. ట్రిపుల్ ఆర్‌లో మునుగోడు నియోజకవర్గ ప్రజలే ఎక్కువ భూమిని కోల్పోతున్నారు. వీరి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా.. అవసరమైతే కేంద్ర మంత్రులను కలుస్తా. మీకు న్యాయం జరిగేంత వరకు శాసనసభ్యుడిగా మీతో పాటు కలిసి పోరాడుతా" అని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సమావేశంలో నారాయణపురం మండలానికి చెందిన భూనిర్వాసితులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# అనర్హతపై ఎలా ముందుకెళ్దాం?

(మొదటిపేజీ తరువాయి)

పిటిషన్‌దారుల సమక్షంలో ఈ కేసు విచారణ ప్రక్రియను స్పీకర్ ప్రసాద్‌కుమార్ చేపట్టాల్సి ఉంది. ఈ నేపథ్యంలో విచారణను ఎమ్మెల్యేలు ఎలా ఎదుర్కొనాలన్నదానిపై న్యాయ నిపుణులతో కొంత చర్చ జరిగింది. ఎమ్మెల్యేలతో భేటీలో వారి నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపైనే సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కువగా చర్చించినట్లు తెలుస్తోంది. భేటీలో పాల్గొన్న 9మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఏయే అభివృద్ధి కార్యక్రమాలు పెండింగ్‌లో ఉన్నాయి, వాటిలో తక్షణం పూర్తి చేయాల్సిన పనులు ఏమేమి ఉన్నాయన్న దానిపై సీఎం ఆరా తీశారు. వాటికి తక్షణమే నిధులు మంజూరు చేస్తామమని హామీ ఇచ్చారు. అలాగే ఆయా ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో ఎదుర్కొంటున్న సమస్యలు, సాధక బాధకాలనూ అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అన్ని విధాలుగా సహకరిస్తానని భరోసా ఇచ్చారు.



# యూరియా కష్టాలు

**మహబూబాబాద్ :** వరుణుడు విజృంభించినా..భానుడు సెగలు కక్కినా.. రైతులు లెక్కచేయడం లేదు. ఒక్క యూరియా బస్తా దొరికితే చాలు. అదే పదివేలు అన్నట్లుగా తయారైంది ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రైతుల పరిస్థితి. రెండు రోజుల అనంతరం హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండలోని పీఏసీఎస్(పెద్దాపూర్) ప్రధాన కార్యాలయానికి యూరియా బస్తాలు వచ్చాయి. దీంతో సొసైటీ పరిధిలోని గ్రామాలకు చెందిన రైతులు ఆదివారం తెల్లవారుజామున అక్కడ బారులు తీరారు. వర్షం పడుతుండటంతో కొందరు గొడుగులు పట్టుకొని, మరికొంత మంది తడుస్తూనే వరుసలో ఉండిపోయారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బంజరుపల్లిలో గోదాం ఎదుట ఇదే పరిస్థితి నెలకొంది. మహబూబాబాద్ జిల్లా కేంద్రం పరిధిలోని శనిగపురంలో ఎండను సైతం లెక్కచేయకుండా యూరియా కోసం అన్నదాతలు బారులు తీరారు. బయ్యారం మండల కేంద్రంలో తమకు యూరియా దొరకలేదంటూ.. పలువురు రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు.

### రైతుపై చేయిచేసుకున్న కానిస్టేబుల్..

మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలో పీఏసీఎస్‌కి ఆదివారం 440 బస్తాల యూరియా వచ్చింది. పలు గ్రామాలకు చెందిన సుమారు మూడు వేల మంది రైతులు అక్కడికి పోటెత్తడంతో యూరియా పంపిణీ పోలీసుల పహారా మధ్య జరిగింది. మధ్యాహ్నం వరకు బస్తాలు ఇవ్వకపోవడంతో రైతులు కోపంతో కేకలు వేశారు. ఈ క్రమంలో ఓ పోలీస్ కానిస్టేబుల్ సూదనపల్లికి చెందిన రైతు మహేశ్‌పై చేసుకున్నారు. ఈ ఘటనపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. రైతులపై చేయిచేసుకోవడం సరికాదంటూ మండిపడ్డారు.



# బీజేపీని నమ్ముకుంటే బీఆర్ఎస్ భవిష్యత్తు దెబ్బతింటుంది

## ఎమ్మెల్యే కూనంనేని

**హైదరాబాద్:** భాజపా-భారత రాష్ట్ర సమితికి మధ్య అవగాహన ఒప్పందం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో భారాస ఎవరికి ఓటు వేస్తుందో చెప్పాలన్నారు. భాజపాని నమ్ముకుంటే భారత రాష్ట్ర సమితి భవిష్యత్తు దెబ్బతింటుందని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం అవినీతిపై పారదర్శక విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తిరిగి చేపట్టాలి ప్రభుత్వానికి సూచించారు. ప్రాంతీయ పార్టీలతో పొత్తులు పెట్టుకొని, వారి కుటుంబాలను భాజపా చీల్చుతుందని సీపీఐ సీనియర్ నేత నారాయణ విమర్శించారు. "జమ్ము కశ్మీర్, తమిళనాడు, మహారాష్ట్రలోనూ కుటుంబాలను చీల్చింది. లిక్కర్ కేసు అంటూ కవితను జైలుకు పంపించారు. చివరకు కవిత సొంత పార్టీ పెట్టుకునే పరిస్థితి వచ్చింది. ఉపరాష్ట్రపతి ఎన్నికలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వలేదంటే భాజపా-భారత రాష్ట్ర సమితి మధ్య ఒప్పందం ఉన్నట్లేనని భావించాలి"అని అన్నారు.



# ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే..

## ములుగు మున్సిపల్ కార్మికుడి ఆత్మహత్యపై కేటీఆర్

**ములుగు, సెప్టెంబరు 7 :** ములుగు మున్సిపల్ కార్మికుడు మైదం మహేశ్ ఈ నెల 3న ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదివారం ఫోన్‌లో ఆరా తీశారు. మాధవరావుపల్లిలోని మహేశ్ కుటుంబాన్ని రెడ్‌కో మాజీ ఛైర్మన్ వై.సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో భారత రాష్ట్ర సమితి శ్రేణులు పరామర్శించాయి. ఈ సందర్భంగా మృతుడి తల్లి రాజమ్మతో కేటీఆర్ ఫోన్లో మాట్లాడారు. 'మహేశ్‌కు 6 నెలలుగా వేతనాలివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తూ.. శ్మశానవాటికలో పని చేయించారు. భార్యాపిల్లలు తిండి లేక అవస్థలు పడ్డారు. ఎంతో ఆవేదనకు గురైన నా కుమారుడు గడ్డి మందు తాగి చనిపోయాడని' రాజమ్మ ఆవేదన వెలిబుచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'వేతనాలు అందక కార్మికుడు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం. దీనికి అసమర్థ కాంగ్రెస్సే కారణం. పైగా మంచినీళ్లు అనుకొని పురుగు మందు తాగి చనిపోయాడని ఓ వీడియోను సృష్టించి ప్రచారం చేస్తోంది. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే. కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి తెచ్చినందుకు సీఎం, మంత్రి సీతక్క క్షమాపణలు చెప్పాలి. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలి. కార్మికులకు న్యాయం జరిగే వరకు భారత రాష్ట్ర సమితి పోరాటం చేస్తుంది. మహేశ్ కుటుంబానికి అండగా ఉంటాం' అని కేటీఆర్ భరోసా ఇచ్చారు.



## 800కుపైగా డ్రోన్లు.. రష్యా అతిపెద్ద వైమానిక దాడి

**ఉక్రెయిన్ :** ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి భారీ స్థాయిలో విరుచుకుపడింది. ఏకంగా 800కుపైగా డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించింది. యుద్ధం మొదలు ఈ స్థాయిలో గగనతల దాడులు చేపట్టడం ఇదే మొదటిసారి. అదేవిధంగా తొలిసారి ఓ ప్రభుత్వ కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్ ప్రతినిధి యూరీ ఇన్హాత్ ఈ దాడులను ధ్రువీకరించారు. ప్రత్యర్థి దేశం 13 క్షిపణులూ ప్రయోగించిందన్నారు. 747 డ్రోన్లు, నాలుగు క్షిపణులను నేలకూల్చినట్లు చెప్పారు. 54 డ్రోన్లు, తొమ్మిది క్షిపణులు కీవ్ సహా దేశవ్యాప్తంగా 37 ప్రాంతాలను తాకినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో ఓ చిన్నారి సహా ముగ్గురు మృతి చెందారు. పదుల సంఖ్యలో పౌరులు గాయపడ్డారు. రష్యా దాడుల్లో కీవ్‌లోని మంత్రుల భవనం పాక్షికంగా ధ్వంసమైంది. ఇందులో ఉక్రెయిన్ మంత్రుల నివాసాలు, కార్యాలయాలు ఉన్నాయి. శత్రుదేశం దాడిలో తొలిసారి ఓ ప్రభుత్వ భవనం దెబ్బతిన్నట్లు ఉక్రెయిన్ ప్రధాని యూలియా స్విరిదెన్కో తెలిపారు. "భవనాన్ని పునర్నిర్మించుకోవచ్చు.. కానీ, ప్రాణాలను తిరిగి తీసుకురాలేం కదా" అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలు మాస్కోపై ఆంక్షలు విధించాలని పిలుపునిచ్చారు. అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ దాడులను తీవ్రంగా ఖండించారు. రాజకీయ సంకల్పంతో క్రెమ్లిన్ దుశ్చర్యలను అడ్డుకోవచ్చన్నారు. మరోవైపు.. కీవ్ సైతం రష్యాకు చెందిన ద్రుజ్బా చమురు పైప్‌లైన్‌పై ప్రతీకార దాడులు చేపట్టింది.

## జపాన్ ప్రధాని ఇషిబా రాజీనామా



**జపాన్ :** జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీలో అంతర్గత విభేదాలకు స్వస్తి పలకాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా జులైలో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో పార్టీ పరాజయానికి బాధ్యత వహించాలంటూ సొంత పార్టీ నేతల నుంచి ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో ఇషిబా నుంచి ఈ ప్రకటన వెలువడింది. గతేడాది ఫుమియో కిషిద రాజీనామా తర్వాత అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన షిగెరు ఇషిబా.. అక్టోబర్‌లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అయితే, ఈ జులైలో జరిగిన ఎన్నికల్లో పార్లమెంట్ ఎగువ సభలో అధికార సంకీర్ణ ప్రభుత్వం మెజార్టీని సాధించలేకపోయింది. అంతకుముందు దిగువ సభలోనూ మెజార్టీ కోల్పోయింది. దీంతో స్వపక్ష సభ్యుల నుంచి ప్రధానిపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో పార్టీ నాయకత్వ మార్పు కోసం ముందస్తు ఎన్నికల నిర్వహించాలా? వద్దా? అనే అంశంపై చర్చించేందుకు లిబరల్ డెమోక్రటిక్ పార్టీ సెప్టెంబర్ 8న నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమైంది. దీనికి ఆమోదం పొందితే ప్రధానిపై వర్చువల్ అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే మీడియా సమావేశం నిర్వహించిన ఇషిబా.. ప్రధాని పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీకి ప్రత్యామ్నాయ నేతను ఎన్నుకునేందుకుగాను ఎన్నికలు నిర్వహించే ప్రక్రియను మొదలు పెడుతున్నట్లు చెప్పారు.

## పదేళ్లుగా ఈసీ 'ఓటు చోరులను' కాపాడుతూ వస్తోంది : ఖర్గే

**ఢిల్లీ:** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎన్నికల కమిషన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లుగా ఈసీ ఓటు చోరులను కాపాడుతూ వస్తూ.. కీలక సమాచారాన్ని దాచి పెట్టిందని విమర్శించారు. 2023లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటరు జాబితా నుంచి ఓట్లను తొలగించడానికి చేసిన యత్నానికి సంబంధించిన కీలకమైన డేటాను ఇప్పటికీ ఎన్నికల కమిషన్ బయటపెట్టలేదని అన్నారు. మే 2023 కర్ణాటక ఎన్నికలకు ముందు అలంద్ నియోజకవర్గంలో ఓటర్లను తొలగించాలని చేసిన ప్రయత్నాలను తమ పార్టీ బయటపెట్టిందని ఖర్గే పేర్కొన్నారు. అప్పట్లో దీనివల్ల వేలమంది ఓటర్లు తమ ఓటు హక్కులు కోల్పోయారన్నారు. ఓటర్లను మోసం చేయడానికి జరిగిన భారీ ప్రయత్నానికి స్పష్టమైన సాక్ష్యాలు ఉన్నప్పటికీ కీలక విషయాలను దాచిపెట్టి.. ఓట్ల చోరీ వెనక ఉన్న వారిని ఈసీ సమర్థంగా రక్షించిందన్నారు. ఓట్ల చోరీకి పాల్పడుతున్న వారిని కాపాడటమే లక్ష్యంగా ఈసీ పదేళ్లుగా పని చేస్తోందన్నారు. అందుకు చట్టాలను మార్చడానికి కూడా వెనకాడట్లేదన్నారు. నాడు కర్ణాటకలో చేసిన విధంగా ప్రస్తుతం బిహార్‌లోనూ ఓటు చోరీకి పాల్పడడానికి కేంద్రం, ఈసీ కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. కేంద్రం చేస్తున్న కుట్రలో భాగంగానే ప్రస్తుతం బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని మోదీ ఓట్ల చోరీ ద్వారా గెలవడానికి యత్నిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాలలో ఎన్డీయే ప్రభుత్వం ఓట్ల చోరీ చేసిందని.. బిహార్‌లో మాత్రం భాజపా, ఈసీని ఒక్క ఓటు కూడా చోరీ చేయనివ్వబోమని అన్నారు. త్వరలో ఎన్డీయే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం కూలిపోతుందన్నారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా బిహార్‌లో చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర' దేశవ్యాప్తంగా ఉద్యమంగా మారుతుందన్నారు.




## రెండో రోజు నిమజ్జనాల సందడి

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో రెండో రోజు గణేశ్ నిమజ్జనాలు సందడిగా కొనసాగుతున్నాయి. నగరం నలుమూలల నుంచి గణనాథుడి ప్రతిమలు నిమజ్జనానికి బయలుదేరాయి. తెలుగుతల్లి ఫ్లైఓవర్, సచివాలయం, ట్యాంక్‌బండ్ తదితర ప్రాంతాల్లో గణపతి విగ్రహాలను తరలిస్తున్న వాహనాలు బారులుతీరాయి. మరోవైపు ఆదిలాబాద్‌లోనూ వినాయక ప్రతిమలను ఊరేగింపు తీసుకెళ్లి పెన్‌గంగా నదిలో నిమజ్జనం చేస్తున్నారు.

# ఐటీ సంస్థలను కాపాడుకుంటాం

- అమెరికాతో కలిసి పని చేస్తున్నాం
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్



**న్యూఢిల్లీ :** దాదాపు 300 బిలియన్ డాలర్ల విలువైన భారత ఐటీ పరిశ్రమ వృద్ధిని కాపాడేందుకు అమెరికాతో కలిసి పనిచేస్తున్నామని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. ఆయన ఓ ఆంగ్ల వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. అమెరికాలో ట్రంప్ సర్కారు భారత ఐటీ ఔట్‌సోర్సింగ్ సంస్థలను లక్ష్యంగా చేసుకోవచ్చనే భయాలు వ్యాపిస్తున్న వేళ ఈ ప్రకటన రావడం గమనార్హం. ఈ విషయంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, ఇతర సర్వీస్ ఆపరేషన్లను భారత్‌లో నిర్వహిస్తున్న బహుళజాతి సంస్థలతో టచ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. మరోవైపు అమెరికా, ఐరోపా, జపాన్, ఆసియా దేశాల ప్రభుత్వాలతోనూ మాట్లాడుతున్నట్లు చెప్పారు. అదే సమయంలో కేవలం ఐటీ రంగంపైనే ఆధారపడకుండా.. ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్, తయారీ రంగాలను ప్రోత్సహించేందుకు వేగంగా చర్యలు చేపడుతోందన్నారు. ఇటీవల కాలంలో స్మార్ట్ ఫోన్ల మార్కెట్‌లో భారత్ వాటా పెరిగిందన్నారు. భారత ఐటీ సేవల రంగంలో దాదాపు 5.67 మిలియన్ల మంది ఉద్యోగాలు చేస్తున్నారు. అంతేకాదు.. ఈ రంగం దేశానికి చెప్పుకోదగ్గ స్థాయిలో ఎగుమతి ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది. భారత్ సంస్థలకు ఐటీ ఔట్ సోర్సింగ్ చేయడంపై ట్రంప్ సర్కారు ఆంక్షలు విధించే అవకాశం ఉన్నట్లు బలంగా ప్రచారం జరుగుతోంది. ఈ ఏడాది భారత్‌లో టెక్నాలజీ అత్యధిక వృద్ధి రేటు నమోదు చేయనుంది. అధిక భాగం ఇంజినీరింగ్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, గ్లోబల్ కెపాసిటీ సెంటర్ల పెరుగుదల దీనికి కారణం కానున్నట్లు నాస్కామ్ నివేదిక వెల్లడించింది.

### కాల్ సెంటర్లకు ట్రంప్ ముప్పు..!

అమెరికాలోని ట్రంప్ కార్యవర్గం భారత్‌కు చెందిన ఐటీ ఎగుమతి, కాల్‌సెంటర్లపై టారిఫ్‌లు విధించవచ్చని ప్రచారం జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అస్థిరత కారణంగా ఐటీ రంగం ఇప్పటికే ఒడుదొడుకులను ఎదుర్కొంటోంది. ఇటీవల కాలంలో తరచూ భారత్ పై విషం కక్కుతున్న ట్రంప్ సలహాదారు పీటర్ నవారో ఓ పోస్టును షేర్ చేశారు. దీనిలో విదేశాలకు ఔట్ సోర్సింగ్ చేయడంపై భారీగా టారిఫ్‌లు విధించాలని కోరారు. ఐటీ రంగానికి అమెరికా అత్యంత కీలకమైంది. అత్యధిక ఆదాయాలు ఆ రంగం నుంచే లభిస్తాయి. ట్రంప్ కార్యవర్గం ఎలాంటి సేవలపై టారిఫ్‌లు విధించే అవకాశం ఉందన్నదానిపై స్పష్టత లేదు. రాజకీయ వ్యాఖ్యాత లారా లూమర్ కూడా ఇటీవల కాలంలో తరచూ ఐటీ కాల్ సెంటర్ల లక్ష్యంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. అమెరికా టారిఫ్‌లు విధిస్తే.. అక్కడ ఐటీ ఆపరేషన్స్ తీవ్రంగా దెబ్బతింటాయని నిపుణులు చెబుతున్నారు. అయితే.. ట్రంప్ కార్యవర్గం ఈ దిశగా ఇప్పటి వరకు తమ నిర్ణయాన్ని ప్రకటించలేదు.

### భారత్ ఐటీ రంగం ఆందోళన ఏమిటీ..?

ట్రంప్ కార్యవర్గం టారిఫ్‌లను విధిస్తే భారత్ సంస్థలకు ఇబ్బందులు తప్పవు. ఇప్పటికే ఆ దేశంలో భారీ పన్నులు చెల్లిస్తున్నాయి. దీనికి అదనంగా టారిఫ్‌లు విధిస్తే.. రెండుసార్లు పన్నుపోటు బారిన పడినట్లవుతుంది. దీనికి తోడు వీసా రూల్స్, స్థానికులను నియమించుకోవడంతో ఇప్పటికే అక్కడ కార్యకలాపాలు ఖరీదైన వ్యవహారంగా మారాయి. భారత్ ఔట్‌సోర్సింగ్ రంగం విలువ 283 బిలియన్ డాలర్లకు పైగా ఉంటుంది. దీనిలో టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, విప్రో వంటి సంస్థలు ఉన్నాయి. వీటి ఆదాయాల్లో 60 శాతం వరకు అమెరికా నుంచే లభిస్తోంది.

### అంత ఈజీ కాకపోవచ్చు..

సరుకుల దిగుమతి మీద విధించినంత తేలిగ్గా ఐటీ దిగుమతులు, ఔట్ సోర్సింగ్‌పై టారిఫ్‌లు విధించలేరని నిపుణులు చెబుతున్నారు. ఈ రంగంలో దిగ్గజ సీఈవోలు మొత్తం ట్రంప్ కార్యవర్గంతో చాలా సన్నిహితంగా ఉంటారు. వారిలో చాలా మంది భారత్‌కు అనుకూలురు ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా వారి వ్యాపారాలు లాభదాయకంగా ఉండాలంటే.. భారత్ నుంచి నిపుణులను నియమించుకోవాల్సి ఉంటుంది. అవి హెచ్1బీ వీసాలతో అమెరికాకు రప్పించి లేదా.. రిమోట్ విధానంలో అయిన పనిచేయించుకోవాల్సి ఉంటుంది. పైగా ట్రంప్ ఇటువంటి నిర్ణయం తీసుకొంటే దానిని పాలసీగా కాకుండా.. భారత్‌కు పంపించే రాజకీయ సందేశంగా భావించాల్సి ఉంటుందని నిపుణులు అంటున్నారు.

## కరేబియన్ సముద్రంపై యుద్ధమేఘాలు

### వెనుజువెలా ఆక్రమణకు అమెరికా సిద్ధం..

**యూఎస్ :** ఏడు యుద్ధాలను ఆపినట్లు పదేపదే చెప్పుకొంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా ఓ కొత్త యుద్ధానికి తెరతీస్తున్నారు. ఈ క్రమంలో భాగంగా కరేబియన్ సముద్రంలో భారీ యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, అత్యాధునిక ఫైటర్‌జెట్‌లను మోహరించారు. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న దేశం చుట్టూ ఇవి సమయం కోసం ఎదురు చూస్తూ కాచుకు కూర్చొన్నాయి. దీంతో కరేబియన్ జలాలపై యుద్ధమేఘాలు కమ్ముకొన్నాయి. ఏ క్షణమైనా అమెరికా దళాలు వెనుజువెలాలో చొరబడొచ్చని ప్రచారం జరుగుతోంది. వెనుజువెలా ముఠాల నుంచి మాదకద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ట్రంప్ మొదటి నుంచి చెబుతున్నారు. తాజాగా ఆ ముఠాలను అంతం చేసేందుకు సైనికదళాలను రంగంలోకి దింపారు. ఈ ముఠాలతో వెనుజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోకు కూడా సంబంధాలున్నాయని ట్రంప్ కార్యవర్గం ఇప్పటికే తీవ్ర ఆరోపణలు చేసింది. ఆయన్ను పట్టించే సమాచారం ఇస్తే ఏకంగా 50 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.430 కోట్లు) బహుమతి ప్రకటించింది. ఇటీవలే మదురో సర్కారు ఇక రోజులు లెక్కపెట్టుకోవాలని ట్రంప్ స్వయంగా సోషల్ మీడియాలో హెచ్చరించారు. మదురో ఎన్నికను అమెరికా గుర్తించడంలేదని శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవెట్టి వెల్లడించారు. దీంతో అక్కడ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం కూడా ట్రంప్ కార్యవర్గానికి ఉన్నట్లు తెలుస్తోంది.

### ఎఫ్-35లు.. గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్లు..!

కేవలం మాదకద్రవ్యాల ముఠాల కోసం యుద్ధం స్థాయిలో అమెరికా బలగాలను మోహరించింది. మొత్తం ఎనిమిది వార్‌షిప్‌లను అక్కడకు పంపింది. ది ఇవో జిమా యాంఫిబియస్ రెడీగ్రూప్‌లోని యూఎస్ఎస్ శాన్ ఆంటోనియో, యూఎస్‌ఎస్ ఇవో జిమా, యూఎస్ఎస్ ఫోర్ట్ లాడర్‌డేల్ నౌకలు 4,500 మంది సైనికులతో కరేబియన్ సముద్రంలోకి వెళ్లాయి. 22వ మెరైన్ యూనిట్ కమాండోలు 2,200 మంది వీరిలో ఉన్నారు. ఏవీ-8బీ హారియర్ అటాక్ ఎయిర్ క్రాఫ్ట్, గైడెడ్ మిసైల్ డెస్ట్రాయర్లైన యూఎస్ఎస్ జాసన్ డున్హామ్, యూఎస్‌ఎస్ గ్రేవ్లీ దక్షిణ కరేబియన్‌లో మోహరించాయి. తూర్పు పసిఫిక్‌లో యూఎస్ఎస్ శాంప్సన్ త్వరలో వచ్చి చేరనుంది. ఒక్కో డెస్ట్రాయర్‌లో 90 క్షిపణులు ఉంటాయి. గైడెడ్ మిసైల్ క్రూయిజర్ యూఎస్ఎస్ లేక్ ఎరి, మిన్నియాపోలీస్ సెయింట్ పాల్ కూడా వెనుజువెలాపై గురిపెట్టి ఉన్నాయి. శుక్రవారం రాత్రి 10 ఎఫ్-35 ఫైటర్ జెట్‌లను ప్యూర్టోరికోలో మోహరించింది. పెద్ద సంఖ్యలో పీ-8 నిఘా విమానాలను రంగంలోకి దించింది. ఇటీవలే డ్రగ్స్ బోటు అంటూ ఓ పడవను అమెరికా దళాలు ముంచేశాయి. దీంతో 11 మంది మరణించారు. అమెరికా మోహరింపులను మదురో తప్పుపట్టారు. గత 100 ఏళ్లలో తమ దేశం ఎదుర్కొన్న అతిపెద్ద ముప్పుగా దానిని వర్ణించారు. 8 నౌకల్లో 1200 క్షిపణులను తమపై గురిపెట్టారని ఆరోపించారు.



### కేవలం డ్రగ్స్ కోసమేనా.. లేక చమురుపై ఆశా..?

వెనుజువెలా నుంచి మాదకద్రవ్యాల ముఠాలు పనిచేస్తున్నాయన్న ట్రంప్ ఆరోపణలు వాస్తవమే. దళాలకు దొరికినప్పుడు సముద్రంలో పారబోసే కొకైన్ దెబ్బకు అక్కడి షార్క్ చేపల్లో కూడా దాని ఆనవాళ్లుంటున్నాయంటే అక్రమ రవాణ స్థాయిని అర్థం చేసుకోవచ్చు. కానీ, డ్రగ్స్‌ను సముద్రంలో పట్టుకొని.. నిందితులను అరెస్టు చేయడానికి ఇంత భారీ సంఖ్యలో యుద్ధ నౌకలు, ఫైటర్‌జెట్‌లు అవసరమా? అన్నదే సందేహాస్పదం. వాస్తవానికి ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలు వెనుజువెలాలో ఉన్నట్లు నిర్ధరణ అయింది. స్టాటిస్టికల్ రివ్యూ ఆఫ్ వరల్డ్ ఎనర్జీ లెక్కల ప్రకారం 2021 నాటికి ఈ దేశంలో 48 వేల మిలియన్ టన్నుల చమురును గుర్తించారు. ఇవి సౌదీలో నిల్వల కంటే అధికం. ప్రపంచ చమురులో 17శాతానికి సమానం. కానీ, ప్రపంచ చమురు వ్యాపారంలో ఈ దేశం వాటా కేవలం 0.8శాతమే. అమెరికా అక్కడి ప్రభుత్వ రంగ కంపెనీ పెట్రోలియస్ డె వెనుజువెలా ఎస్ఏపై ఆంక్షలు విధించడమే దీనికి కారణం. అగ్రరాజ్యంతో పాటు కెనడా, ఐరోపా సమాఖ్య తదితర దేశాలు కలిసి 350 ఆంక్షలు విధించాయి.

### ఎప్పటి నుంచో ట్రంప్ కన్ను..

ట్రంప్ తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడు 'వెనుజువెలాలో చమురు రిజర్వులను అమెరికా స్వాధీనం చేసుకోవాలి'అని అన్నారు. 2017లో ఓ ఇంటెలిజెన్స్ బ్రీఫింగ్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుజువెలాపై ఎందుకు యుద్ధం చేయడంలేదని ప్రశ్నించారు. "వాళ్ల వద్ద చాలా చమురు ఉంది. భౌగోళికంగా మనకు చాలా దగ్గర" అని వ్యాఖ్యానించారు. గతంలో కూడా మదురో సర్కారును కూల్చేందుకు ట్రంప్ ప్రయత్నించారు. 2023లో ఉత్తరకరోలినా రిపబ్లికన్ పార్టీ సభలో ప్రసంగిస్తూ "నేను గతంలో పదవిని వీడే సమయానికి వెనుజువెలా కుప్పకూలడానికి సిద్ధంగా ఉంది. మేము దానిని ఆక్రమించుకొనే వాళ్లం. దాని చమురు మొత్తాన్ని తీసుకొనే వాళ్లం. ఇప్పుడు దాని నుంచే చమురు కొంటున్నాం" అని పేర్కొన్నారు. ట్రంప్ మనసులో ఈ ఆలోచన ఎప్పటి నుంచో ఉందనడానికి ఇదే నిదర్శనంగా నిలిచింది. అప్పట్లో అమెరికా ఎన్ఎస్ఏ హెచ్.ఆర్. మెక్‌మాస్టర్ సహా పలువురు మంత్రులు ట్రంప్ ఆలోచనను వ్యతిరేకించారు.

## మా ఆయుధాలతోనే రష్యాపై దాడి : జెలెన్‌స్కీ



**కీవ్:** రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఉపయోగిస్తున్న ఆయుధాల్లో 60 శాతం తమ దేశంలోనే ఉత్పత్తి చేస్తున్నట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఇతర దేశాల నుంచి ఆయుధాలను దిగుమతి చేసుకుంటున్నప్పటికీ.. స్వదేశీ ఉత్పత్తులపైనా దృష్టి పెట్టామన్నారు. ఓ వైపు సంఘర్షణలు కొనసాగుతున్నప్పటికీ కీవ్ బలమైన, అత్యాధునిక ఆయుధాలను తయారు చేసే స్థాయికి ఎదగడం గర్వకారణమన్నారు. అయితే తాము సాధించాల్సిన లక్ష్యాలు ఇంకా ఉన్నాయన్నారు. ప్రస్తుతం గగనతల రక్షణ వ్యవస్థల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇతర దీర్ఘశ్రేణి ఆయుధాలు, క్షిపణుల కోసం మిత్ర దేశాలతో త్వరలో చర్చలు జరపనున్నట్లు పేర్కొన్నారు. రష్యా దాడులను తీవ్రతరం చేస్తున్న నేపథ్యంలో వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు ఉక్రెయిన్ తన దేశీయ రక్షణ పరిశ్రమలను గణనీయంగా విస్తరించినట్లు కీవ్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇందులో భాగంగానే ఇటీవల గగనతల రక్షణ వ్యవస్థలతో పాటు రెండు కొత్త బాలిస్టిక్ క్షిపణులను అభివృద్ధి చేసినట్లు తెలిపాయి. విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు.. 2025 బడ్జెట్‌లో భారీ కేటాయింపులు చేసినట్లు తెలుస్తోంది.

### ఆ ఉగ్రరాజధానిలో ఎప్పటికీ కాలు పెట్టను..

చైనా పర్యటన అనంతరం రష్యా అధ్యక్షుడు పుతిన్ మాట్లాడుతూ.. యుద్ధం ముగింపుపై చర్చలు జరపడానికి మాస్కోకు రావాలని జెలెన్‌స్కీని ఆహ్వానించారు. దీనిపై ఉక్రెయిన్ అధ్యక్షుడు స్పందిస్తూ.. తమ పౌరుల ప్రాణాలను పొట్టనబెట్టుకున్న ఆ ఉగ్రరాజధానిలో తాను ఎన్నటికీ కాలు మోపనని స్పష్టం చేశారు. చర్చలను మరింత ఆలస్యం చేయడానికే పుతిన్ ఇలాంటి రాజకీయ యుక్తులు పన్నుతున్నారని.. అమెరికాతోనూ ఆటలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యుద్ధం ముగింపు కోసం ఓ నిర్ణయం తీసుకోవాలనే ఆలోచన పుతిన్‌కు ఉంటే.. ఆయనే కీవ్‌కు రావాలని ఆహ్వానించారు.

## అమెరికాలో ఉక్రెయిన్ మహిళ దారుణ హత్య



**యూఎస్ :** రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలో యుద్ధభూమిలో ఉండలేక ప్రశాంతమైన జీవితం కోసం అమెరికాకు శరణార్థిగా వచ్చిన ఉక్రెయిన్ మహిళ దారుణ హత్యకు గురైంది. ఈ హత్యకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మృతురాలిని ఉక్రెయిన్‌కు చెందిన ఇరినా జరుత్స్కాను (23)గా గుర్తించారు. ఆగస్టు 22న నార్త్ కరోలినాలోని షార్లెట్‌లో ఈ ఘటన జరిగింది. రైల్లో ప్రయాణిస్తున్న సమయంలో.. ఆమె వెనుక కూర్చున్న నిందితుడు డెకార్లోస్ బ్రౌన్ జూనియర్ కత్తితో పొడిచి చంపేశాడు. అనంతరం నిందితుడు తర్వాతి స్టాప్‌లో దిగిపోయాడు. ఈ ఘటనతో రైలులోని ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దాడికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని.. అతడికి నేరచరిత్ర ఉన్నట్లు వివరించారు.



## జైల్లో లైబ్రరీ క్లర్క్‌గా ప్రజ్వల్ రేవణ్ణ

**బెంగళూరు:** ఇంట్లో పనిమనిషిపై అత్యాచారానికి పాల్పడిన కేసులో హాసన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు యావజ్జీవ శిక్ష పడిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పరప్పన అగ్రహార జైలులో ఉన్న ఆయనకు.. లైబ్రరీ క్లర్క్‌గా పనిని కేటాయించినట్లు జైలు అధికారులు పేర్కొన్నారు. తోటి ఖైదీలకు పుస్తకాలు జారీ చేయడం, వాటికి సంబంధించిన వివరాల రికార్డులను నిర్వహించడం వంటి బాధ్యతలు అప్పగించారు. ప్రతి పని దినానికి రూ.522 జీతంగా ప్రజ్వల్‌కు అందిస్తామని అధికారులు పేర్కొన్నారు. జైలు నిబంధనల ప్రకారం.. జీవిత ఖైదు అనుభవిస్తున్న వారు జైల్లో ఏదో ఒక రకమైన పని చేయాల్సి ఉంటుందని.. వారి నైపుణ్యాలను బట్టి నియామకాలు చేపడతామన్నారు. ప్రజ్వల్ ఆఫీస్ వర్క్‌ను ఎంచుకోవడంతో లైబ్రరీ క్లర్క్‌గా పని కేటాయించామన్నారు. జైల్లో ఖైదీలు సాధారణంగా నెలకు కనీసం 12 రోజులు, వారానికి మూడు రోజులు తప్పకుండా పని చేయాలనే నిబంధనలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# వామ్మో.. వానరాలు..!



- ఇళ్లలోకి చొరబడుతున్న కోతులు
- ప్రజలపైకి ఎగబడుతూ దాడులు
- బెంబేలెత్తిపోతున్న వలిగొండ మండల ప్రజలు



**వలిగొండ, రాజముద్ర న్యూస్ :** మండలంలోని పలు గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువైంది. మనుషులు కనబడితే చాలు మీద దూకుతూ దాడి చేస్తున్నాయి. మనుషులు లేని సమయాల్లో ఇళ్లల్లోకి చొరబడి వస్తువులను తీసుకెళ్లి రోడ్లపై పడేస్తున్నాయి. ఇళ్లలోకి వచ్చిన వానరాలను వెళ్లగొట్టేందుకు ప్రయత్నించిన ఐదు మంది కిందపడి కాళ్లు, చేతులు విరిగి ఆస్పత్రి పాలయ్యారు. మండల కేంద్రంతోపాటు పులిగిల్ల, వెల్వర్తి, దాసిరెడ్డిగూడెం తదితర గ్రామాల్లో కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. మండలంలో రైతులు వ్యవసాయ రంగంపై అధారపడి జీవనం సాగించే వారు. ఏదారేళ్లుగా ఈ ప్రాంతం దినదినాభివృద్ధి చెందడంతో వ్యవసాయ భూములు ప్లాట్లుగా, ఫాంహౌస్ లుగా మార్చారు. దీంతో ఆయా ప్రాంతాల్లోని చెట్లను నరికేశారు. దీంతో వ్యవసాయ క్షేత్రాల్లో ఉండే వానర సైన్యం ఊళ్ల మీద పడుతోంది. అలాగే మండల కేంద్రంలోని పలు ఫంక్షన్ హాల్‌లలో సైతం కోతులు తిష్ట వేసి అక్కడి వస్తువులను చిందరవందరగా చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మండల కేంద్రంలో వానరసైన్యం ఇళ్లల్లోకి వచ్చి దాడులు చేయడంతో ఆసుపత్రుల పాలవుతున్నారు.

### కోతుల బెడద ఎక్కువైంది

రోజురోజుకు కోతుల బెడద ఎక్కువైంది. ఇంటి నుంచి బయటకు వెళ్లాలంటేనే భయంగా ఉంది. పిల్లలను దుకాణాలకు పంపిచాలంటే భయం వేస్తోంది. ఇంటి ఆవరణలో ఏవైనా ధాన్యం ఆరబోసుకోవాలంటే కూడా ఇబ్బందిగా మారింది. అదేవిధంగా రైతులు వరి పత్తి మరే ఇతర కూరగాయ పంటను వేసిన కోతులు ధ్వంసం చేస్తుండడంతో రైతులను నష్టపోతున్నామని వాపోతున్నారు.

### వీధుల్లో తిరుగలేక పోతున్నాం

వీధుల్లో తీరుగలేక పోతున్నాం. ఎప్పుడు కోతుల గుంపు దాడిచేస్తుందోనని భయంతో బతుకుతున్నామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కోతుల గుంపు ఇబ్బంది పెడుతోంది. ఇంత జరగుతున్నా.. సంబంధిత అధికారులు మాత్రం వాటిని అడవుల్లోకి తరలించడానికి ఎలాంటి ప్రయత్నం చేయడం లేదు. ఇళ్లలో ఉన్న మహిళలు మధ్యాహ్నం వేళల్లోనూ డోర్లు వేసుకోని ఉండాల్సి వస్తుందని అంటున్నారు.

## గణపతి ఉత్సవాలకు విరాళం అందించిన డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి



**వలిగొండ, రాజముద్ర న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో రామ్ నగర్ కాలనీలో గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం జరిగింది. ఇట్టి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి 5000 రూపాయలను, అప్పారెడ్డిపల్లి గ్రామంలోని అంబేద్కర్ యూత్ సభ్యులకు ఐదు వేల రూపాయలను, ఆరూర్ గ్రామంలోని యూత్ సభ్యులకు ఐదు వేల రూపాయలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో మైసొల్ల ప్రవీణ్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## భారీ వర్షానికి వివిధ కాలనీలో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

**వరంగల్ :** వరంగల్ నగరంలో ఆదివారం భారీ వర్షం రావడం వలన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టీవీ టవర్, సహకార కుంట, విగ్నేశ్వర కాలనీ, ఎన్టీఆర్ నగర్ కాలనీలో వర్షాపు నీరు రావడంతో వాహనాల రాకపోకులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం వల్ల అధికారులు ఏర్పాట్లు చేయడానికి కూడా అనేక ఇబ్బందులు పడ్డారు. సరైన డ్రైనేజ్ వ్యవస్థ లేకపోవడంతో మురికి నీరు కాలనీలోని ఇండ్లలోకి చేరింది . దోమలు ఎక్కువగా ఏర్పడి కుట్టడం వలన మలేరియా, డయేరియా, జ్వరాలు ఏర్పడి హాస్పిటల్ పాలవుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. పందులు విచ్చలవిడిగా తిరగడం వలన వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉందని, ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందనలేదని కాలనీవాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఆయా ప్రాంతాలను పర్యవేక్షించి సమస్యను అంచనాలను వేశారు. వరంగల్ నగరంలోని బస్టాండ్ లో గంట పాటు కురిసిన భారీ వర్షానికి బస్టాండ్ పరిసరాలు జలమయ్యాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడడం జరిగింది. దీంతో వాహనాలు నిలిచిపోయాయి. అధికారులు వెంటనే స్పందించి నిలిచిన నీటిని తొలగించే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరారు.





## రాయిగూడెంలో బీఆర్ఎస్ గల్లంతు

- పది రోజుల్లో మూడోసారి కాంగ్రెస్ గూటికి చేరికలు
- తుంబూరు దయాకర్ రెడ్డి సమక్షంలో 50 కుటుంబాలకు కండువా


**ఖమ్మం జిల్లా బ్యూరో, రాజముద్ర న్యూస్ 7 :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని రాయిగూడెం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి గట్టి దెబ్బ తగిలింది. పదిరోజుల వ్యవధిలో మూడోసారి వరుసగా పెద్ద ఎత్తున చేరికలు జరగడంతో గ్రామంలో బీఆర్ఎస్ ప్రభావం గల్లంతైపోయింది. ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి సమక్షంలో మాజీ ఎంపీపీ కొర్ల కుంట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి చేరుతున్న వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మహిళలు కూడా పెద్ద సంఖ్యలో పార్టీలో చేరటం విశేషం. దీంతో ఆ గ్రామంలో బీఆర్ఎస్‌కి జాడ మిగల్లేదని నేతలు వ్యాఖ్యానించారు. అభివృద్ధి, సంక్షేమమే ప్రజలు కాంగ్రెస్ వైపు ఆకర్షితులవ్వడానికి ప్రధాన కారణమని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ తగిన గౌరవం, ప్రాధాన్యత కల్పిస్తామని దయాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నుపూసల సీతారాములు, నాయకులు కొడాలి గోవిందరావు, కోసూరి పానకాలు, కుక్కల హనుమంతరావు, ఎనికే జానకిరామయ్య, కోసూరి రాజాబాబు, లక్క రాముడు, వెన్నబోయిన కమలాకర్, ఇరగదింధ్ల నాగరాజు, కోసూరి రమేష్, యడవల్లి సైదులు, వెన్నబోయిన ప్రసాద్, కోసూరి రాంబాబు పాల్గొన్నారు.

## రోమియో జూలియట్ యునిసెక్స్ సెలూన్‌ను ప్రారంభించిన హీరోయిన్ మీనాక్షి చౌదరి





**హైదరాబాద్, సెప్టెంబర్:** కూకట్‌పల్లిలోని పాపారాయుడు నగర్ లో రోమియో జూలియట్ యునిసెక్స్ సెలూన్ ను ప్రముఖ హీరోయిన్ మీనాక్షి చౌదరి, మేనేజింగ్ డైరెక్టర్ వీరా తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మీనాక్షి చౌదరి మాట్లాడుతూ, "వ్యక్తిగత గ్రూమింగ్ ఆధునిక జీవితంలో ఒక ముఖ్యమైన భాగం, మరియు రోమియో జూలియట్ వంటి సెలూన్లు వృత్తి నైపుణ్యం, సృజనాత్మకత మరియు సౌకర్యం యొక్క పరిపూర్ణ సమ్మేళనాన్ని సృష్టిస్తాయి. అందం, శైలి మరియు విశ్వాసంతో పురుషులు మరియు మహిళలు ఇద్దరికీ ఒకే పైకప్పు కింద యునిసెక్స్ ప్రీమియం గ్రూమింగ్ సేవలను అందించాలనే వారి దార్శనికతను ప్రశంసిస్తునాను అన్నారు". రోమియో జూలియట్ యునిసెక్స్ సెలూన్ మేనేజింగ్ డైరెక్టర్ వీరా మాట్లాడుతూ మా కథ రోమియో జూలియట్ ప్రేమకథ వలె అందం మరియు విశ్వాసం యొక్క బంధంలో పాతుకుపోయింది. ప్రొఫెషనల్ నైపుణ్యం మరియు కస్టమర్ సెంట్రిక్ సేవల ద్వారా అసాధారణమైన గ్రూమింగ్ అనుభవాలను నిరంతరం అందించడం మా లక్ష్యం. కూకట్‌పల్లి ప్రజలకి అత్యంత విశ్వసనీయమైన మరియు ఆకాంక్షాత్మకమైన గ్రూమింగ్ గమ్యస్థానంగా ఉండాలనేది మా దార్శనికత, సరసమైన ధరలకు ప్రపంచ స్థాయి పరిమాణాలతో సెలూన్ అనుభవాలను అందిస్తున్నాం అని తెలిపారు.



## చిలుకూరు బాలాజీ ఆలయం మూసివేత

### ఆలయ ప్రధాన అర్చకులు సిఎస్.రంగరాజన్


**మొయినాబాద్ :** సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా చిలుకూరు బాలాజీ ఆలయం ఆదివారం సాయంత్రం 4గంటల నుంచి తత్కాలికంగా మూసివేసామని ఆలయ ప్రధాన అర్చకులు సి ఎస్.రంగరాజన్ తెలిపారు. చంద్రగ్రహణం అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాల తర్వాత సోమవారం ఉదయం 8 గంటలకు ఆలయాన్ని తెరిచి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు.



# చంద్రగ్రహణం

## పలు ఆలయాల మూసివేత

చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు శ్రీవారి ఆలయాన్ని అధికారులు మూసివేశారు. ఇవాళ మధ్యాహ్నం 2 గంటల వరకు 27,525 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఆదివారం అన్ని ఆర్జిత సేవలు రద్దు చేశారు. అర్ధరాత్రి 12 తర్వాత నిర్వహించే ఏకాంత సేవను మధ్యాహ్నం 3 గంటలకే పూర్తి చేశారు. భూవరాహస్వామి ఆలయంతో పాటు, అన్న ప్రసాద వితరణ కేంద్రాలను సైతం మూసివేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా 50 వేల పులిహోర, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచి శుద్ధి చేశాక 3 గంటలకు సుప్రభాతంతో దర్శనాలు ప్రారంభిస్తామని, అప్పటి నుంచే సర్వదర్శనం క్యూలైన్‌లోకి భక్తులను అనుమతిస్తామని తితిదే అధికారులు తెలిపారు. చంద్రగ్రహణం కారణంగా శ్రీశైలం మల్లన్న, ఒంటిమిట్ట కోదండరామస్వామి, భద్రాచలం సీతారామచంద్రస్వామి, సింహాచలం అప్పన్న, బెజవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ ఆలయం సహా తెలుగు రాష్ట్రాల్లోని దేవాలయాలన్ని మూసివేశారు.



మూసి వేసిన తిరుమల శ్రీవారి ఆలయం





సింహాచలం అప్పన్న ఆలయం తలుపులు మూసివేసిన అర్చకులు

### యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో..

సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో ఆలయాలు మూసివేశారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు స్వయంభూ పంచ నారసింహుల దేవాలయంతో పాటు, అనుబంధ శివాలయం, పాతగుట్ట శ్రీలక్ష్మీ నారసింహ స్వామి ఆలయాలను మూసివేశారు. సోమవారం ఉదయం 3.30 గంటలకు ప్రధాన ఆలయాన్ని తెరిచి సంప్రోక్షణ చేయనున్నారు. నిత్య కైంకర్యాల అనంతరం భక్తులను యథావిధిగా అనుమతించనున్నారు. గ్రహణం నేడు(ఆదివారం) రాత్రి 9.56 గంటలకు ప్రారంభమై అర్ధరాత్రి 1.26 గంటలకు ముగియనుందని ఆలయ అర్చకులు తెలిపారు.






సింహాచలం అప్పన్న ఆలయం తలుపులు మూసివేసిన అర్చకులు



విజయవాడ కనకదుర్గ ఆలయంలో..




# డెంగీ కంగారొద్దు

వానాకాలం రాగానే దోమలు విజృంభిస్తుంటాయి. వీటితో పాటే జ్వరాలూ చెలరేగుతుంటాయి. వీటిల్లో డెంగీ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఎందుకంటే చాలామంది ప్లేట్‌లెట్ల గురించి తీవ్ర ఆందోళన చెందుతుంటారు. నిజానికి అంత కంగారు అవసరం లేదు. అందరికీ ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సిన అవసరం రాదు. చాలావరకూ మామూలు చికిత్సతోనే జ్వరం తగ్గుతుంది. కాబట్టి డెంగీ తీరుతెన్నులు, చికిత్స, నివారణ మీద సరైన అవగాహన కలిగుండటం తప్పనిసరి.

ఈడిస్ జాతి దోమలు కుట్టటం ద్వారా డెంగీ వైరస్‌లు వ్యాపిస్తాయి. దోమ కుట్టిన 3-14 రోజుల్లో ఎప్పుడైనా ఇన్‌ఫెక్షన్ తలెత్తొచ్చు. ఈ వైరస్‌లలో ప్రధానంగా నాలుగు రకాలున్నాయి. ఒక రకంతో ఒకసారే ఇన్‌ఫెక్షన్ వస్తుంది. అయితే మరో రకం వైరస్‌తో రెండోసారి వస్తే తీవ్రంగా ఉంటుంది. మొదటి రకం వైరస్‌ను ఎదుర్కోవటానికి పుట్టుకొచ్చిన యాంటీబాడీలు రెండో రకం వైరస్‌ను కణాల్లోంచి నిర్మూలించ లేవు. దీంతో ఇన్‌ఫెక్షన్ చాలా తీవ్రంగా ఉంటుంది. కాబట్టే తగు జాగ్రత్త అవసరం. ఎవరికైనా నాలుగు వైరస్‌లతో నాలుగు సార్లు డెంగీ వస్తే జీవితంలో మళ్లీ ఎప్పుడూ వచ్చే అవకాశమే ఉండదని చెప్పుకోవచ్చు.

## ఆసుపత్రిలో ఎప్పుడు?

మామూలు చికిత్సతో తగ్గకపోయినా, తీవ్ర డెంగీ లక్షణాలు కనిపిస్తున్నా ఆసుపత్రిలో చేర్చి, చికిత్స చేయాలి. రక్తం చిక్కబడటంతో డెంగీ తీవ్రదశ మొదలవుతుంది. ఇది సాధారణంగా 24-48 గంటల వరకూ కొనసాగుతుంది. ఆ తర్వాత దానంతటదే కుదురుకుంటుంది. కానీ కొందరికి గంటల్లోనే పరిస్థితి విషమించొచ్చు. కాబట్టి రక్తం చిక్కదనాన్ని తెలిపే హిమటోక్రిట్/ప్యాక్డ్ సెల్ వాల్యూమ్, ప్లేట్‌లెట్ల సంఖ్యను తెలిపే రక్త పరీక్షలు తరచూ చేస్తూ జాగ్రత్తగా కనిపెట్టుకోవాల్సి ఉంటుంది. ఊపిరితిత్తుల్లోకి ప్లాస్మా ద్రవం లీకై, ఆయాసం వస్తుంటే వెంటిలేటర్ అమర్చి చికిత్స చేయాల్సి ఉంటుంది.

## లక్షణాలు ఇవీ..

డెంగీ వైరస్ సోకినా అందరికీ జ్వరం రాకపోవచ్చు. ఓ 10% మందిలోనే ఇన్‌ఫెక్షన్‌గా మారుతుంది. దీంతో ఉన్నట్టుండి తీవ్రమైన జ్వరం.. అతి తీవ్రంగా, తల పగిలిపోతోందేమో అన్నంత తలనొప్పి.. కళ్ల వెనక నొప్పి, వాంతి, వికారం, ఒళ్లు నొప్పులు, నడుం నొప్పి, కీళ్ల నొప్పులు, ఆకలి తగ్గటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలామందికి ఒకట్రెండు లక్షణాలతోనే ఆగిపోవచ్చు కూడా. కొందరు తీవ్రదశకు చేరుకోవచ్చు. డెంగీలో జ్వరం తగ్గాకే అసలు ప్రమాదం మొదలవుతుంది. ప్లేట్‌లెట్లు తగ్గటం, రక్తనాళాల్లోంచి ద్రవం లీకవటం, రక్తంలో హిమోగ్లోబిన్ పెరగటం, రక్తం చిక్కబడటం అప్పుడే ఆరంభమవుతుంది. దీంతో మెదడు, కాలేయం, గుండె, ఊపిరితిత్తుల వంటి కీలక అవయవాలు దెబ్బతినటం, షాక్ సింగ్రోమ్ వంటి తీవ్ర అనర్థాలు తలెత్తుతాయి. కాబట్టి హమ్మయ్య జ్వరం తగ్గిందని అనుకోవద్దు. కొన్ని హెచ్చరికలను బట్టి తీవ్రదశ సంకేతాలను పసిగట్టొచ్చు. వీటిని గమనిస్తే ఏమాత్రం నిర్లక్ష్యం చేయొద్దు.

## మామూలు చికిత్సతోనే


ఒక మాదిరి డెంగీ జ్వరానికి పారాసిటమాల్ మాత్రలే సరిపోతాయి. అలాగే ఓఆర్‌ఎస్ పొడి కలిపిన నీళ్లు తాగుతుండాలి. వాంతులవుతుంటే వీటిని తగ్గించే మందులూ అవసరం. చాలామందికి దీంతోనే డెంగీ నయమవుతుంది.



## బొప్పాయితో జాగ్రత్త

ప్లేట్‌లెట్లు పెరగటానికి కొందరు బొప్పాయి ఆకుల రసం తాగిస్తుంటారు. ఇది మంచి పద్ధతి కాదు. ఆకు రసంతో పేగుల్లో పుండ్లు పడే అవకాశముంది. అదేపనిగా బొప్పాయి, కివీ వంటి పండ్ల రసాలు తీసుకోవటమూ తగదు. ఇవి మితిమీరితే పొటాషియం మోతాదు ఎక్కువై, రక్తపోటు పడిపోవచ్చు.

## ప్లేట్‌లెట్లు పడిపోయినా..



ప్లేట్‌లెట్లు 40 వేలకు, 30 వేలకు పడిపోయా యని అతిగా గాబరా పడొద్దు, భయపడొద్దు. ఎందుకంటే డెంగీలో ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గటం వల్ల మరణించటం చాలా అరుదు. అందరికీ వీటిని ఎక్కించాల్సిన అవసరం లేదు. ప్లేట్‌లెట్ల సంఖ్య లక్ష కన్నా తగ్గినప్పుడు డాక్టర్ల పర్యవేక్షణలో ఉండాలి. 50వేల కన్నా తక్కువకు పడిపోతే నిశితంగా గమనిస్తూ ఉండటం ముఖ్యం. 20 వేల కన్నా తగ్గిపోయి, రక్తస్రావ లక్షణాలు కూడా కనిపిస్తున్నట్టయితే ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సి ఉంటుంది. అదే 10వేల కన్నా తగ్గితే రక్తస్రావం అయినా, కాకపోయినా ప్లేట్‌లెట్లు ఎక్కించాలి. ప్లేట్‌లెట్లను ఇతర రక్త పదార్థాల మాదిరిగా ఫ్రిజ్‌లో నిల్వ చేయలేం. అందువల్ల దూర ప్రాంతాల నుంచి సరఫరా చేసి, ఎక్కించే క్రమంలో కొన్నిసార్లు బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లు తలెత్తొచ్చు. కొందరికివి రక్తంలోకి విస్తరించి, ప్రాణాపాయమూ సంభవించొచ్చు.

### చేయకూడనివి

- కార్టికోస్టిరాయిడ్లు ఇవ్వద్దు. ఇవి పేగుల్లో రక్తస్రావం, గ్లూకోజు బాగా పడిపోవటం, రోగనిరోధకశక్తి తగ్గటానికి దారితీస్తాయి.
- డెంగీకి ప్రత్యేకించిన యాంటీ వైరల్ మందులేవీ లేవు. వైరల్ ఇన్‌ఫెక్షన్లకు యాంటీబయాటిక్స్ పనిచేయవు కాబట్టి వీటిని వాడొద్దు.
- ముందుజాగ్రత్తగా ప్లేట్‌లెట్లు ఎక్కిస్తే ప్రయోజనం లేదు. ఇది తీవ్ర డెంగీ ముప్పునేమీ తగ్గించదు. పైగా ద్రవాల మోతాదు పెరిగి, ఎక్కువరోజులు ఆసుపత్రిలో ఉండాల్సి వస్తుంది.
- అనవసరంగా సెలైన్ ఎక్కించొద్దు. నోటితో ద్రవాలు తీసుకోలేకపోతున్నా, రక్తంలో హిమోగ్లోబిన్ శాతం ఎక్కువున్నా, రక్తపోటు బాగా పడిపోయినా సెలైన్ అవసరం. అదీ తగినంత మోతాదులోనే ఎక్కించాలి. మూత్రం తగినంతగా వస్తున్నా, రక్తం పలుచగా అవుతున్నా సెలైన్ మోతాదు తగ్గించాలి.



# అత్యంత సంపన్న బోర్డు బీసీసీఐ

## బోర్డు ఖాతాలో రూ.20,000 కోట్లు



ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రికెట్ బోర్డు బీసీసీఐ. మరి అది ఎంత రిచ్చో తెలిస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే. బీసీసీఐ ఖాతాలో రూ. 20 వేల కోట్లకుపైగా నిధులు ఉన్నట్లు కథనాలు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా గత ఐదేళ్లలో బోర్డు సంపద దాదాపు మూడు రెట్లు పెరిగినట్లు సమాచారం. అత్యంత విజయవంతమైన ఐపీఎల్‌తో బోర్డుకు భారీగా ఆదాయం వస్తోంది. అలాగే ఐసీసీ నుంచి అందే వాటాతోపాటు అంతర్జాతీయ, దేశవాళీ మ్యాచుల మీడియా హక్కుల నుంచి ఆదాయం అందుతోంది. బీసీసీఐ 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1,623 కోట్ల మిగులు నమోదు చేసింది. ఇది అంతకుముందు ఏడాది రూ.1,167 కోట్లుగా ఉండేది. సెప్టెంబర్ 28న బీసీసీఐ ఏజీఎం జరగనుంది. ఈ క్రమంలో 2024 అకౌంట్స్‌కు సంబంధించిన స్టేట్‌మెంట్ వివరాలు బయటకొచ్చాయి. క్రీడా వర్గాల సమాచారం మేరకు.. బీసీసీఐ వద్ద 2019 నాటికి రూ.6 వేల కోట్లు మాత్రమే ఉండేవి. అయితే, గత ఐదేళ్లలో అదనంగా రూ.14,627 కోట్ల సంపదను సృష్టించింది. దీంతో మొత్తం రూ.20,686 కోట్లకు చేరింది. మరే ఇతర క్రికెట్ బోర్డు వద్ద కూడా ఇంత మొత్తం ఉండే అవకాశం లేదు. "బీసీసీఐ సభ్యులకు కార్యదర్శి సమర్పించిన వివరాల ప్రకారం.. 2019లో రాష్ట్ర సంఘాలకు చెల్లించాల్సిన వాటితో కలిపి బ్యాంక్ బ్యాలెన్స్ అండ్ క్యాష్ రూ.6,059 కోట్లు ఉండేది. ఇప్పుడు ఆయా సంఘాలకు చెల్లించినది పోగా మిగులు రూ.20,686 కోట్లకు చేరింది. గత ఐదేళ్లలో రూ.14,627 కోట్ల సంపద అదనంగా వచ్చి చేరింది. ఒక్క గతేడాదే రూ.4,193 కోట్ల ఆదాయం వచ్చింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీసీసీఐ రూ. 1,200 కోట్లను మైదానాల్లో మౌలిక సదుపాయాల కోసం కేటాయించింది. ప్లాటినమ్ జూబ్లీ ఫండ్‌గా రూ. 350 కోట్లు, క్రికెట్ అభివృద్ధి కోసం రూ. 500 కోట్లు కేటాయించింది. రాష్ట్ర క్రికెట్ సంఘాలు రూ.1,990 కోట్లు అందుకొన్నాయి" అని క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. ఈ వివరాలకు అధికారికంగా 28న జరిగే ఏజీఎంలో ఆమోదం తెలపడమే తరువాయి.



## విరాట్ ఫిట్‌నెస్ స్కోరు నాకు పంపాడు

### ఫుట్‌బాల్ స్టార్ సునీల్ ఛెత్రీ

భారత సీనియర్ క్రికెటర్ విరాట్ కోహ్లి ప్రస్తుతం లండన్‌లో ఉంటున్నాడు. అక్కడే ఫిట్‌నెస్ టెస్టుకు హాజరయ్యాడు. దీనిపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. అందరినీ సమంగా చూడాలని.. ఇలాంటి మినహాయింపు ఇవ్వడం సరైంది కాదని కామెంట్లు వచ్చాయి. రోహిత్, గిల్, యశస్వి.. సహా ఇతర క్రికెటర్లు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీలో ఫిట్‌నెస్ టెస్టులు చేయించుకున్నారు. లండన్‌లో కోహ్లి ఫిట్‌నెస్ స్కోరు గురించి తాజాగా అతడి స్నేహితుడు ఫుట్‌బాల్ స్టార్ సునీల్ ఛెత్రీ ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. తనకు టెస్టు స్కోరు పంపించాడని తెలిపాడు. కొవిడ్ సమయంలో వీరిద్దరూ ఫిట్‌నెస్‌కు సంబంధించి అనేక అంశాల గురించి చర్చించిన వీడియోలు వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే. "కొద్ది రోజుల కిందట కోహ్లి నాకు ఓ మెసేజ్ చేశాడు. అతడి ఫిట్‌నెస్ టెస్టుకు సంబంధించిన స్కోర్లు అవి. ఇలాంటి వ్యక్తుల గురించి తెలుసుకోవడం భలేగా ఉంటుంది. వారి ఫిట్‌నెస్ శ్రద్ధకు ఎవరైనా దాసోహం కావాల్సిందే. మీకు ఏదైనా కష్టంగా అనిపించినప్పుడు ఇలాంటి వారి నుంచి స్ఫూర్తి పొందొచ్చు. మీరు అత్యుత్తమ దశలో ఉంటే.. విరాట్ లేదా రొనాల్డోలా మారాలని చెబుతుంటారు. వీరిద్దరూ క్రీడా రంగంలో నెలకొల్పిన ప్రమాణాలు అద్భుతం. వ్యక్తిగతంగా నేను రొనాల్డోను కలవలేదు. కానీ, చాలా ఏళ్లుగా అతడిని గమనిస్తూనే ఉన్నా. ఇక విరాట్ గురించి బాగా తెలుసు. వీరిద్దరిలో ఉండే కామన్ విషయం ఏంటంటే.. ఇప్పటి వరకూ వారు సాధించిన దానికి సంతోషపడదు. ఇంకా సాధించాల్సింది ఉందని భావిస్తారు. నేను కూడా అలాంటి మార్గంలోనే పయనించాలని ఆలోచనలు చేస్తుంటా. ఇవాళ ఏం జరిగిందనేది విరాట్, రొనాల్డో పట్టించుకోరు.. రేపటి కోసం ఎలా సిద్ధం కావాలనే దానిపైనే దృష్టిపెడతారు. ఇలా ఉండటం మనం మాట్లాడుకున్నంత సులువేం కాదు. సుదీర్ఘకాలంగా విజయవంతమైనా సరే.. మళ్లీ నూతన లక్ష్యం కోసం సిద్ధమవడం వారికే సాధ్యం" అని సునీల్ ఛెత్రీ వెల్లడించాడు. విరాట్ ఫిట్‌నెస్ టెస్టు స్కోరు ఎంత అనేది మాత్రం ఛెత్రీ షేర్ చేయలేదు.



## ఓపెనింగే కీలకం..

### అతడి ఆర్డర్ మారిస్తేనే బెటర్ : మాజీ క్రికెటర్

టీ20ల్లో ఇన్నింగ్స్ ఆరంభమే అత్యంత కీలకం. శుభారంభం దక్కితే చాలు తర్వాత వచ్చే బ్యాటర్లు చెలరేగిపోతారు. ఇప్పుడు ఆసియా కప్ బరిలోనూ టీమ్ఇండియా అమలు చేసే వ్యూహం ఇదే కావాలనేది మాజీ క్రికెటర్ల సూచన. టీ20 ఫార్మాట్‌లోనే ఈ మినీ టోర్నీ మరో రెండు రోజుల్లో ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌ను భారత్ సెప్టెంబర్ 10న యూఏఈతో తలపడనుంది. ఈ క్రమంలో మాజీ క్రికెటర్ మదన్‌లాల్ బ్యాటింగ్ ఆర్డర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఓపెనింగ్ జోడీ నుంచి సంజును పక్కన పెట్టాలని సూచించాడు. వన్‌డౌన్ లేదా మిడిలార్డర్‌లో ఆడించాలని తెలిపాడు. "ఓపెనర్లుగా అభిషేక్ శర్మ - శుభ్‌మన్ గిల్ బరిలోకి దిగాలి. అభిషేక్ స్ట్రైక్‌రేట్ 225, గిల్‌ది 150 కంటే ఎక్కువగా ఉంది. టీ20ల్లో ఓపెనింగ్ అత్యంత కీలకం. తొలి ఆరు ఓవర్లలోనే గేమ్‌ను సెట్ చేయాలి. తొమ్మిదో ఓవర్ వరకూ కాస్త నెమ్మదిగా ఆడినా.. మళ్లీ ఆఖరి ఓవర్లలో దూకుడు పెంచాలి. చివరి మూడు ఓవర్లలో హిట్టర్లు క్రీజ్‌లో ఉంటే స్కోరు దూసుకుపోతుంది. ఇక టీమ్‌లో స్పిన్నర్లు కీలక పాత్ర పోషిస్తారు. దుబాయ్ పిచ్‌పై చాలా ప్రభావం చూపిస్తారు. అక్కడ చాలా వేడిగా ఉంటుంది. పిచ్‌పై తేమ ఉండదు. జట్టులో అత్యుత్తమ స్పిన్నర్లు ఉన్నారు. ఆరంభంలో పేసర్లు బ్రేక్ ఇస్తే.. మిగతా పనిని స్పిన్నర్లు చూస్తారు. అఫ్గానిస్థాన్ జట్టు నలుగురు, పాక్ ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం ఉంది. ఇప్పుడు ఎక్కువ టీమ్‌లు స్పిన్నర్లపైనే ఆధారపడ్డాయి" అని మదన్‌లాల్ వ్యాఖ్యానించాడు.


### జితేశ్‌కే ఛాన్స్..?

దుబాయ్‌లోని ఐసీసీ అకాడమీలో భారత్ తొలి ప్రాక్టీస్ సెషన్‌ను నిర్వహించింది. అయితే, అక్కడికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దానికి కారణం సంజు శాంసన్ కంటే ఎక్కువగా జితేశ్ శర్మే వికెట్ కీపింగ్ ప్రాక్టీస్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో మేనేజ్‌మెంట్ కూడా తుది జట్టు విషయంలో ఓ హింట్ ఇచ్చినట్టైంది. సంజును కేవలం బ్యాటర్‌గానే తీసుకొనే అవకాశం ఉంది. ఒకవేళ కూర్పు కోసం పక్కన పెట్టినా ఆశ్చర్యపడక్కర్లేదు.

## అవన్నీ కట్టుకథలే

### వారి స్నేహానికి నేనే ప్రత్యక్ష సాక్షిని : యుద్ధజీత్ దత్తా

భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీపై పరోక్షంగా 'హుక్కా' కామెంట్లు చేసిన ఇర్ఫాన్ పఠాన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. యువరాజ్ సింగ్ తండ్రి యోగ్‌రాజ్ కూడా ధోనీ, విరాట్‌పై తన అక్కసు వెళ్లగక్కిన సంగతి తెలిసిందే. యోగ్‌రాజ్‌కు ఇప్పుడు ఇర్ఫాన్ తోడయ్యాడంటూ నెట్టింట కామెంట్లు వచ్చాయి. అయితే, ధోనీతో ఇర్ఫాన్ పఠాన్‌కు మంచి దోస్తీ ఉందని మాజీ మేనేజర్ ఒకరు సోషల్ మీడియాలో పోస్టు పెట్టడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. "ఇర్ఫాన్ పఠాన్, ఎంఎస్ ధోనీ స్నేహాన్ని నేను ప్రత్యక్షంగా చూశా. అలాంటి అదృష్టం నాకు దక్కింది. కొన్నేళ్ల కిందట ధోనీతోపాటు ఇతర క్రికెటర్ల యాడ్స్‌కు పనిచేశా. పెప్సీ షూటింగ్ సమయంలో ఇర్ఫాన్, ధోనీతో కలిసి నేను ఒకే వ్యాన్‌లో తిరిగాను. ఆ తర్వాత నాకు వారిద్దరూ సంతకాలు చేసిన బ్యాట్లను గిఫ్ట్‌గా ఇచ్చారు. ఆ బ్యాట్లపై వారిద్దరూ ఆటోగ్రాఫ్‌తోపాటు తమ స్నేహం గురించి కూడా కొన్ని లైన్లు రాశారు. ఇది తమ ఇద్దరి మధ్య అనుబంధానికి సంబంధించి గుర్తుగా ఉంచుకోమన్నారు. ఇప్పటికీ ఆ బ్యాట్లు నాతోనే ఉన్నాయి. ఇప్పుడు ప్రచారం అవుతోన్న వార్తలను చూస్తే నాకు గత రోజులు గుర్తుకొచ్చాయి. అందుకే, నిజం కంటే ఇలాంటి కట్టుకథలే త్వరగా సంచలనమవుతాయి" అని మాజీ మేనేజర్ యుద్ధజీత్ దత్తా తెలిపారు. ధోనీకి ఒకప్పుడు మేనేజర్‌గా పనిచేసినట్లు చెప్పుకొచ్చాడు.



www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం · తెలుగు దిన పత్రిక

# కిల్లింగ్ లుక్‌లో ప్రీతి అస్రాని

యంగ్ హీరోయిన్ ప్రీతి అస్రాని సీరియల్ ద్వారా ఫుల్ పాపులారిటీ దక్కించుకుంది. ఇక నటనపై ఆసక్తితో 'మళ్ళీరావా' చిత్రంతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి ఫుల్ పాపులారిటీని సొంతం చేసుకుంది. ఆ తర్వాత తెలుగు, తమిళ సినిమాల్లో నటించిన ప్రీతి అతి తక్కువ సమయంలోనే ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్‌గా మారింది. ప్రస్తుతం వరుస అవకాశాలు అందుకుంటూ ఫుల్ పామ్‌లో ఉంది. త్వరలోనే ప్రీతి 'కిస్' మూవీతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అలాగే ఈ సినిమాతో పాటు 'కిల్లర్'లోనూ నటిస్తోంది. ఇందులో మల్టీ టాలెంటెడ్ నటుడు నటిస్తూ తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను శ్రీ గోకులం మూవీస్, ఏంజెల్ స్టూడియోస్ బ్యానర్స్‌పై నిర్మిస్తున్నారు. ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో ప్రీతి, ఎస్ జే సూర్య జంటగా నటించబోతున్నారు. ఇప్పటికే షూటింగ్ ప్రారంభం కాగా.. మూవీ మేకర్స్ వరుస అప్డేట్స్ ఇస్తున్నారు. నేడు ప్రీతి అస్రాని పుట్టిన రోజు కావడంతో ఆమెకు విషెస్ తెలుపుతూ చిత్రబృందం ఓ మెస్మరైజింగ్ పోస్టర్‌ను షేర్ చేశారు. ఇక ఇందులో రెడ్ కలర్ చీర కట్టుకున్న ప్రీతి గాగుల్స్ పెట్టుకుని చేతిలో పెన్ పట్టుకుని పెదాలపై పెడుతూ స్టైలిష్ లుక్‌లో కనిపించింది. ప్రస్తుతం ఈ పోస్టర్ ప్రేక్షకుల్లో అంచనాలను పెంచుతోంది.





# బాలీవుడ్‌లో దూసుకుపోతున్న దిశా పటానీ

'లోఫర్' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన బాలీవుడ్ బ్యూటీ దిశా పటాని.. తెలుగులో అంతగా గుర్తింపు తెచ్చుకోనప్పటికీ బాలీవుడ్‌లో మాత్రం బ్యాక్ టు బ్యాక్ చిత్రాలు అనౌన్స్ చేస్తుంది. ఇక గతేడాది వచ్చిన 'కల్కి' చిత్రంతో పాన్ ఇండియా రేంజ్‌లో గుర్తింపు తెచ్చుకుని ఇప్పుడు మరోసారి ప్రభాస్‌తో జత కట్టేందుకు సిద్ధం అయింది. ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' చిత్రంలో దిశా పటానీ హీరోయిన్‌గా ఫిక్స్ అయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ సినిమాతో బిజీగా ఉంటూనే మరో మూవీలో జాయిన్ అయ్యింది ఈ బ్యూటీ. దిశా పటానీ బాలీవుడ్‌లో విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఓ మూవీ చేయబోతుంది. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో షాహిద్ కపూర్ హీరో కాగా.. త్రిప్తి డిమ్రి, నానా పటేకర్, రణదీప్ హుడా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇక ఈ మూవీలో దిశా పటానీ అతిథి పాత్రకు ఎంపిక అయింది. అంతే కాకుండా.. రీసెంట్‌గా షూటింగ్‌లో కూడా జాయిన్ అయినట్లు తెలుస్తుంది. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన న్యూస్ నెట్టింట వైరల్ అవుతుండగా.. బాలీవుడ్‌లో దిశాకు ఉన్న క్రేజ్ చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు



# సిగ్గు లేకుండా ప్రేమలో పడిపోయా : వర్ష బొల్లమ్మ

యంగ్ హీరోయిన్ వర్ష బొల్లమ్మ 'సతురన్' మూవీతో పరిచయం అయింది. ఇక 'చూసి చూడంగానే' సినిమాతో తెలుగు ప్రేక్షకులను అలరించింది. పలు మూవీస్ చేసినప్పటికీ వర్ష బొల్లమ్మ పెద్దగా ఫేమ్ సంపాదించుకోలేకపోయింది. ఇక గత ఏడాది 'ఊరు పేరు భైరవ కోన' చిత్రంతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఇటీవల 'తమ్ముడు'తో వచ్చి భారీ డిజాస్టర్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఇక ఆ తర్వాత ఎలాంటి ప్రాజెక్ట్ రాకపోవడంతో సోషల్ మీడియాపై తన పూర్తి ఫోకస్ పెట్టింది. నిత్యం పలు హాట్ ఫొటోలతో క్రేజీ పోస్టులు పెడుతోంది. తాజాగా, వర్ష ఇన్‌స్టాగ్రామ్ ద్వారా కొన్ని ఫొటోలు షేర్ చేస్తూ షాకింగ్ క్యాప్షన్ ఇచ్చింది. డెనిమ్ షర్ట్ ధరించి ప్యాంటు వేసుకోకుండా ఒంటరిగా బీచ్‌కు వెళ్లిన ఈ భామ థైయ్స్ చూపిస్తూ రచ్చ చేసింది. ఇక ఈ పోస్ట్‌కు సిగ్గు లేకుండా సముద్రంతో ప్రేమలో పడిపోయానంటూ క్యాప్షన్ పెట్టింది. దీంతో ఈ ఫొటోలు చూసిన నెటిజన్లు సిచ్యువేషన్ షిప్‌లో ఉన్న ఆనందంలో ప్యాంట్ వేసుకోవడం మర్చిపోయావా.. అని కొందరు అంటుంటే.. మరికొందరు మాత్రం ఎక్కడ దొరుగుతాయి ఇలాంటి క్యాప్షన్స్.. నీ తోడలు నువ్వు పెట్టిన క్యాప్షన్ సూపరో సూపర్ అంటూ కామెంట్లు పెడుతున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com